సామెతకథలు

## తీతువుపిట్ట రాయబారం

- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

ఒకానొక సమయములో సముద్రతీరాన తీతువొకటి గూడు కట్టుకుని తన పెండ్లాముతో కాపురము చేస్తూండేది. ఒక్కరోజున నిండు గర్భంతాల్చిన ప్రియురాలిని చేరి, "నీయిష్టం ఏదైనా కోరుకో. అది ఎట్లాంటిదైనా చేస్తాను."తోన్నది. ఆడ తీతువు "ఓ చెలువుడా! పర్వదినాల్లో సముద్రుడు తన పెద్ద తరంగాలతో ఆకసం అంటేటట్లు పొంగుతూ ఉంటాడు. ఆనాడు నేను పెట్టిన గుడ్లను తన జలాలతో పాటు అపహరించుకొని పోతూన్నాడు. ఇటువంటి ఆపత్తు ఎన్నోసార్లు కలిగింది. ఎదుగూ - పొదుగూ లేని యీ దు:ఖ జీవితం అనుభవించడం కంటె మనం మఱొక్క చోటు చూచుకొని పోవడం మంచిది. అంతేకాదు. ఇక్కడ ఉండడం మనకు ఎంతమాత్రం క్షేమంకాదు కూడా" అంది. మగ తీతువు నవ్వుచు "ఓసి! ప్రియురాలా! భయపడకు వినుము. పక్షి జాతికి ప్రభువైన గరుడుడు జీవించియున్నంత కాలము మనకు కీడు చేసి సముద్రుడే కాక మఱెవ్వడుకూడా ప్రాణాలతో నిలువలేడు. నీవు చీకూ - చింత విడిచి సుఖంగా ఉండు"మన్నది.

కొంత కాలానికి తన ప్రియురాలు గుడ్లు పెట్టింది. మఱి కొంతకాలానికి వాడుకచొప్పున సముద్రం పొంగడము గుడ్లు యధాప్రకారంగా ప్రగాహవేగంలో పడి కొట్టుకుపోవడము జరిగింది. తీరని విచారంతో దు:ఖిస్తున్న తన ప్రియురాలిని ఊరడించి మగతీతువు సముద్రుడికి బుద్ధిచెప్పడానికి నిశ్చయించుకొంది. వెంటనేపోయి పక్షికులాన్నంతను ఒక్కచోట సమావేశం చేసింది. తనకు సముద్రుడివల్ల నిత్యం వస్తూండే కడగండ్లు సభలో విన్నవించుకొంది. "అయ్యలారా! మనమందఱం పక్షి రాజైన గరుత్మంతుణ్ణి ప్రార్థించి, అతనితో మన యరిష్టం చెప్పుకొందాము. అతడు తప్పక మనకు హితం చేయగలడని నాయాశ. ఇందులో మీరు నాకు సాయం చేయవలసిందని మిమ్ములను వేడుకొంటూ ఉన్నాను" అన్నది. పక్షి సమూహం భక్తి శ్రద్ధలతో ధ్యానం చేసింది. వినతా నందనుడు సాక్షాత్కరించాడు. పక్షులు తమ కష్టాన్ని ప్రభువుతో మనవి చేసికొన్నాయి.

గరుడుడు తీతువుపిట్ట తరపున రాయబారిగా పోయి సముద్రుడితో "ఓయీ! నీవు ఇంతకుపూర్వం హరించిన తీతువుయొక్క గుడ్లన్నిటిని భద్రంగా అప్పగిస్తే పక్షికులం నిన్ను క్షమిస్తుంది. లేకుంటే నీపై దాడిచేసి నీ రూపుమాపడానికి నిశ్చయం చేసి కొంది" అని బెదిరించాడు. సముద్రుడు వినమ్రుడై గజ గజలాడుతూ గుడ్లను తెచ్చి యిచ్చి "ఓయి! పక్షిరాజా! ఇకముందెన్నడు నీ పక్షి సంతతిని కష్టాలు తెచ్చి పెట్టను. శాంతుడవై తప్పిదమొనర్చిన నన్ను మన్నించు"అని వేడుకొన్నాడు.

(అసలు కథకు కొన్ని మార్పులు చేసి ప్రచురించడం జరిగింది.)

**"పాదుషా భారతం" సామెత కథ వచ్చే సంచికలో ...**